క్లుప్తంగా

పరామర్శ

కార్వేటినగరం: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శనివారం పరామర్శించారు. చిప్పారపల్లికి చెందిన ఉప సర్పంచ్ దూది మునేంద్ర, పెనుమూరు మాజీ సర్పంచ్, యతీశ్వర్‌నాయుడు తల్లి కమలమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆయా గ్రామాలకు వెళ్లి పరామర్శించారు.

పాలసముద్రం: బలిజకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మునస్వామినాయుడు భార్య రాజమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమె మృతిచెందిన సమయంలో అందుబాటులో లేదని వారి కుటుంబాన్ని శనివారం మాజీ డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి పరామర్శించారు.

రికార్డులు లేకుంటే చర్యలు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎంవీఐ

నింద్ర: వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన రికార్డులు లేకుంటే చర్యలు తప్పవని నగరి ఎంవీఐ వాసుదేవరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలుచోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వాహనదారులతో మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు, లైసెన్స్ ఉండాలని అన్నారు. లేకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని అన్నారు. రికార్డులు సక్రమంగాలేని పలు వాహనాలను సీజ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆలపాకం దళితవాడలో జిల్లా అధికారులు

విజయపురం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. ఆలపాకంకండ్రిగ దళితవాడలో ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్ అనే అనుమానం కలగడంతో శనివారం ఆయన పర్యటించారు. ఇంటింటా ఫీవర్, లార్వా సర్వే చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ముక్కుపుడక బహూకరణ



ముక్కుపుడకను బహూకరిస్తున్న దాతలు

కార్వేటినగరం: సంతాన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీలక్ష్మీదేవి వారికి కార్వేటినగరానికి చెందిన బాలచంద్రారెడ్డి, చిరంజీవిరెడ్డి కలసి శనివారం బంగారు ముక్కుపుడకను బహూకరించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించి దాతలకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కానిస్టేబుళ్లు

విజయపురం: నింద్ర పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వినోద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. 2013 బ్యాచ్ తోటి కానిస్టేబుళ్లు కలసి రూ.లక్ష ఆర్థికసాయాన్ని శనివారం నత్త గ్రామానికి చెందిన వినోద్ భార్యకు అందజేశారు. తోటి ఉద్యోగికి ఆర్థికసాయం చేసిన కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి

కార్వేటినగరం: కార్వేటినగరం ఎక్సైజ్ సీఐగా శిరీషాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను కార్యాలయం సిబ్బంది శాలువలు కప్పి సన్మానించారు. ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని మండలాలు తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఉండడం వల్ల ఎక్కువ నిఘా ఉంచి అక్రమ మద్యం వ్యాపారస్తులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐలు శ్రావణకుమార్, మోసస్ పాల్గొన్నారు.

లక్కీడిప్ కలిసొచ్చేనా?

- లైసెన్స్ ఫీజు రూ.55 నుంచి 65 లక్షలు
- విజయదశమి కానుకగా ప్రైవేటు మద్యం పాలసీ
- సందిగ్ధంలో పోటీదారులు
- 11 షాపులకు ఇప్పటి వరకు వచ్చినవి 12 దరఖాస్తులే
- పెత్తనం చెలాయించాలని చూస్తున్న కూటమి నేతలు



నగరిలోని ఎక్సైజ్ స్టేషన్

నగరి: ఏ ప్రభుత్వమైనా విజయదశమికి ప్రజాప్రయోజన పథకానికి నాంది పలుకుతుంది. కానీ కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చేలా చేస్తోంది. ఎక్కడో ఊరికి దూరంగా అక్కడక్కడా ఉన్న మద్యం షాపులు పట్టణంలోకి ప్రజల మధ్యకు అందుబాటులోకి రానున్నాయి. దీంతో తాగినోళ్లకు తాగినంత మద్యం అందించి వారి జీవితాలను చిన్నాభిన్నం చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే నూతన మద్యం పాలసీకి నాంది పలికింది. మద్యం దుకాణాలను ప్రభుత్వం నుంచి ప్రైవేటుకు కట్టబెడుతూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 12వ తేదీ నుంచి మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. నగరి ఎక్సైజ్ పరిధిలో 11 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. 11న చిత్తూరులో షుగర్ ఫ్యాక్టరీ కల్యాణమండపంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తారు. 12న విజయదశమి కానుకగా దుకాణాల్లో మద్యం అమ్మకాలు సాగనున్నాయి.

భయపెట్టే లైసెన్స్ ఫీజులు

లాటరీలో అదృష్టం ఉండి మద్యం దుకాణం వస్తే మున్సిపాలిటీలో అయితే రూ.65 లక్షలు, మండలంలో అయితే రూ.55 లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించాల్సిందే. రూ.2 లక్షలు దరఖాస్తు ఫీజుతో పాటు ఈ డబ్బులు కూడా దుకాణదారుడు చెల్లించాలి. ఇంతగా వెచ్చించి షాపు పెడితే వ్యాపారం జరిగి అంత లాభం వస్తుందా, లాభాలు రాకుంటే సిండికేట్‌కు అవకాశం ఉందా? అలా కాకపోతే పెట్టిన డబ్బుల పరిస్థితి ఏంటి అనే సంశయం టెండర్ వేయాలనుకున్న వారి మదిలో మెదలుతోంది. నగరి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గతంలో 30 దాకా షాపులు నగరి ఎక్సైజ్ పరిధిలో ఉండేవని ప్రస్తుతం 11 షాపులు మాత్రమే ఉండడంతో వ్యాపారం మొత్తం 11 షాపులకే జరుగుతుందని, షాపులు వచ్చిన వారికి లాభాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు తెలుపుతున్నారు.

తగ్గిన మద్యం ధర లాభాల బాట పట్టిస్తుందా..

ప్రభుత్వం రూ.99 కే క్వార్టర్ ఇస్తానని చెబుతోంది కనుక ఎక్కువ మంది తాగే అవకాశం ఉంది. అదీ గాక తమిళనాడులో క్వార్టర్ రూ.130 నుంచి 150కి లభిస్తోంది. ఈ వ్యత్యాసం తమిళనాడు వాసులను నగరికి రప్పిస్తుందని కొందరు నమ్ముతున్నారు. అక్కడి నుంచి వచ్చి వెళ్లే రవాణా చార్జీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు లాంటివి వారిని రప్పించే పరిస్థితి ఉండదని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు. షాపు ఎవరికి దక్కినా పెత్తనం తమదే ఉండాలంటూ కూటమి నేతలు సిద్ధమవుతున్నారు.

లాటరీ ధర ఎక్కువే?

లాటరీ టికెట్ కొంటే అదృష్టవశాత్తు డబ్బులు వస్తే వస్తుంది లేకుంటే లాటరీ టికెట్ కొన్న డబ్బులు వృథాగానే పోతుంది. అలా మద్యం షాపుల్లో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు కొనాల్సిన టికెట్ (దరఖాస్తు) ధర రూ.2 లక్షలు. షాపు కావాలని కోరుకునే వారు ఇంత మొత్తాన్ని లాటరీకి పెట్టి పరీక్షించుకోవాల్సిందే. డిప్‌లో షాపు రాకుంటే రూ.2 లక్షలు వదులుకోవాల్సిందే.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయల్లో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ కనులపండుగగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరిలతో కలసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవలింపు సేవ నిర్వహించారు.

గోవింద భక్తులకు అన్నదానం



గోవింద భక్తులకు అన్నదానం చేస్తున్న నేతలు

నగరి: పెరటాసి నెల మూడో శనివారం ప్రత్యేకం కావడంతో వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ఆధీనం నగరి పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయం, సత్రవాడలోని కరివరదరాజ స్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు టీటీడీ వారితో పాటు భక్తులు కూడా ప్రసాదాలు అందజేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు పెరటాసి నెల శనివారం పురస్కరించుకొని పాదయాత్ర చేసే గోవింద భక్తులకు పట్టణంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ కన్నియప్ప, మధు, సుబ్రమణ్యం, నాగరాజు, దేవరాజులురెడ్డి, నిరంజన్‌రెడ్డి, మహేష్, శీను, శశికుమార్, రామన్, భాస్కర్, శివ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సతీష్

పుత్తూరు: తపాలా శాఖ అందిస్తున్న పొదుపు, బీమా రక్షణ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ సతీష్ కోరారు. శనివారం పుత్తూరు తపాలా కార్యాలయానికి వచ్చిన ఖాతాదారులు, మహిళలకు ఆయన తపాలా శాఖ అందిస్తున్న వివిధ సేవలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ వరకు తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ సేవలను సైతం అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటి వద్దకే డోర్ సేఫ్టీ బ్యాంకింగ్ సేవలతో పాటు పొదుపు ఖాతాలకు నెట్ బ్యాంకింగ్, ఏటీఎం సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వివరించారు. తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెయిల్ ఓవర్సీర్స్ మురళి, రాహుల్ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల తపాలా శాఖ ఉద్యోగులు శనివారం సబ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్ఎఫ్, ఏఐసీడీఎస్‌యూ యూనియన్ల పిలుపు మేరకు టార్గెట్ల పేరుతో సిబ్బందిపై వేధింపులు ఆపాలని నల్లబ్యాడ్జీలను ధరించి విధులు నిర్వహిస్తునట్లు తెలిపారు. క్రిష్ణయ్య, జీవ, రుతుపవన్, హరీష్, ఉమాపతిపాల్గొన్నారు.



వెంగళరాజుకుప్పంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అప్రమత్తతతో పాలజ్వరం దూరం

- వ్యాధితో పాల దిగుబడికి గండి



పాలజ్వరంతో బాధపడుతున్న పాడి పశువు

కార్వేటినగరం: పశువులకు తరచూ వచ్చే వ్యాధి పాలజ్వరం. ఇది సోకడం వల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గి పాడి రైతులు నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ వ్యాధి ఆవులు, గేదెలకు ఈనిన మొదటి వారంలో సోకే అవకాశం ఉంటుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమకుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా అధిక పాల ఉత్పత్తి ఉండే పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. పశువు ఈనిన వెంటనే పాలుపితకడం, క్యాల్షియం లోపం కారణంగా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి సోకితే పశువు తగిన మోతాదులో పాలు ఇవ్వక రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని ఆయన వెల్లడిస్తున్నారు.

వ్యాధి నివారణ ఇలా..

ఈనిన వెంటనే పశువు పొదుగును శుభ్రపరచాలి. పాడి పశువు నుంచి మొత్తం పాలను పిండకుండా కొంచెం ఉంచాలి. అలాగే పశువునకు కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజ లవణాలను తగిన మోతాదులో అందించడంతో పాటు కాల్షియం ఇంజెక్షన్లను వేయించాలి. ఈ చిన్నపాటి పద్ధతులు పాటిస్తే పాల జ్వరం నుంచి పశువులను కాపాడుకోవచ్చు.

వ్యాధి లక్షణాలు

పాలవ్యాధి సోకిన పశువుల్లో వ్యాధి లక్షణాలు మూడు దశల్లో ఉంటాయి. మొదటి దశలో మేత సరిగ్గా తీసుకోకపోవడం, నెమరు వేయకపోవడం, పళ్లు కొరుకుతూ బెదురుచూపులతో చికాకుగా ఉంటాయి. వణుకుతూ కదలడానికి కూడా ఇబ్బంది పడతాయి. వ్యాధి ప్రారంభంలో శరీర ఉష్ణోగ్రత మామూలుగా ఉండి ఆ తర్వాత సాధారణ స్థాయి కంటే తగ్గి చల్లబడుతుంది. తర్వాతి దశలో పశువులు నిలబడలేకపోతాయి. శ్వాస, నాడి తగ్గి పశువులు కదలకుండా ఉండిపోతాయి. ఈ స్థితిలో పశువులు తలను పొట్టపై డొక్కలో ఆనించి ఎస్ ఆకారంలో మగతగా పడుకుని ఉంటాయి. వ్యాధి చివరిదశలో శ్వాస నాడి వేగం పడిపోతుంది. పశువు ఒకవైపు పడిపోవడం, తద్వారా కడుపుఉబ్బరం లక్షణాలు కనిపిస్తాయి. వణుకుతో చలనం లేకుండా అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. వైద్యం వెంటనే అందించకుంటే పశువులు చనిపోతాయి. వీటితో పాటు కంటి నుంచి నీరు కారడం, చెవులు వాలిపోతూ కనిపిస్తాయి. చూపు మందగించడం, చిరాకుగా ప్రవర్తించడం వంటి లక్షణాలు ఉంటాయి.

నష్టాలు వస్తున్నాయి



నాకు మూడు ఆవులు న్నాయి. గత నెలన్నరగా పాలిచ్చే రెండు ఆవులు నీరసంగా ఉంటున్నాయి. సక్రమంగా పాలివ్వడం లేదు. పశు వైద్యులకు చూపిస్తే పాలజ్వరం సోకినట్లు నిర్ధారణ అయింది. ఎన్ని రకాల మందులు వాడినా పాలజ్వరం తగ్గలేదు. పాల ఉత్పత్తి తగిపోయి నష్టం పోయాను. పశు వైద్యుల సూచనలు, సలహాలను పాటించడంతో పాల జ్వరం తగ్గి పాల ఉత్పత్తి పెరిగింది.

ప్రకాష్‌రాజు, పాడిరైతు, రాజులకండ్రిగ, కార్వేటినగరం

దేవీ అలంకారం.. దేదీప్యమానం

- భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు





నగరి: గాయత్రి అలంకరణలో దేశమ్మ. ఇడ్లీ పాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో శనివారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నేత్రప్రదాయణి దేశమ్మ దేవత గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణంలోని కరకంఠేశ్వరాలయంలోని కామాక్షి దేవి మహాలక్ష్మి అలంకరణ భక్తులను కటాక్షించారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి చంద్రగంట అలంకారంలో దర్శనమిచ్చారు. సత్రం దక్షిణ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ద్రాక్షాయణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నవరాత్రి ఉత్సవాలకు ఓంశక్తి ఆలయంలో మహిళలకు స్వయం ఉపాధి పనిముట్లు పంపిణీ చేశారు.

జీడీ నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: స్థానిక శ్రీ అల్లి ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో మహాలక్ష్మిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మహాలక్ష్మీ అవతారంలో మాడవీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు.

పుత్తూరులో..

పుత్తూరు: గ్రామదేవత ఆరేటమ్మ మీనాక్షీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వడమాలపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూడి క్రాస్ వద్ద అంకాలమ్మ అన్నపూర్ణ దేవిగా భక్తులను కటాక్షించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: బలిజకండ్రిగలోని చెవుటి గంగమ్మ అర్ధనారీశ్వరుడి అలంకరణలో, గిరిరాజ కన్యకా పరమేశ్వరి సరస్వతీదేవిగా, పడవేటమ్మతల్లి గాయత్రీదేవిగా భక్తులను కటాక్షించారు.



కార్వేటినగరం: వైష్ణవీదేవిగా శ్రీబంగారమ్మ

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: శ్రీబంగారమ్మ వైష్ణవీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నింద్రలో..

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.









జీడీనెల్లూరులో మహాలక్ష్మిగా.., పుత్తూరు: మీనాక్షీదేవిగా ఆరేటమ్మ, పుత్తూరు: అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి, పాలసముద్రం: అర్ధనారీశ్వరుడి అలంకరణలో..

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అటవీశాఖ పరిధిలో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ కోరారు. జిల్లాలో 100 మందికి పైగా పలు పథకాల కింద కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, బేస్ క్యాంప్, చెక్‌పోస్టులు, ఇతర విభాగాల్లో ప్రొటెక్షన్ వాచర్స్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల కొందరిని పలు కారణాలతో తొలగించారని, వీరిపై ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబం పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పలు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం వస్తోందని వెల్లడించారు. ఆప్కాస్‌లో కింద ఉద్యోగులను చేర్చి రూ.25 వేలు జీతం ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రెండు ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫయర్స్ వితరణ



అర్ధగిరి క్షేత్రంలో ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫయర్స్‌ను వితరణ చేస్తున్న సప్తగిరి బ్యాంక్ అధికారులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం బ్యాంక్ తరఫున రూ.20 వేల విలువైన రెండు ఆర్‌ఓ వాటర్ ప్యూరిఫయర్స్ ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్‌రెడ్డి, సిబ్బందికి స్వామి వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

61 మందికి ఉద్యోగ అవకాశాలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 61 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఏ, నైపుణ్యాభివృద్ధి శాఖ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి 131 మంది అభ్యర్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వారిలో 61 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. ఐటీఐ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి యుగంధర్ పాల్గొన్నారు.